క్లుప్తంగా

త్వరలో అర్తమూరుకు త్రిఫేస్ విద్యుత్


పాపారాయుడు

మండపేట: అర్తమూరుకు నిరంతర విద్యుత్ ఉండేలా త్వరలో త్రిఫేస్ సరఫరా ఇచ్చేందుకు అధికారులు చర్యలు చేపట్టినట్టు వైఎస్సార్ సీపీ రంపచోడవరం నియోజకవర్గ పరిశీలకుడు కర్రి పాపారాయుడు తెలిపారు. స్థానిక పార్టీ కార్యాలయంలో శనివారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. గ్రామానికి త్రిఫేస్ సరఫరా ఇవ్వాలని ఎన్నో సార్లు గత పాలకులకు మొరపెట్టుకున్నా ఫలితం లేదన్నారు. సమస్యను ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు దృష్టికి తీసుకురాగా ఆయన వెంటనే స్పందించి విద్యుత్ ఉన్నతాధికారులకు ఆదేశాలిచ్చారన్నారు. అలాగే ఎమ్మెల్సీ తోట ద్వారా పార్టీ రీజనల్ కోఆర్డినేటర్, ఎంపీ మిధున్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేసినట్టు పాపారాయుడు తెలిపారు. గ్రామంలో పుంత రోడ్లు, బీసీ కమ్యూనిటీహాలు అభివృద్ధికి ఎమ్మెల్సీ తోట హామీ ఇచ్చారని పాపారాయుడు పేర్కొన్నారు.

మున్సిపల్ మాజీ చైర్మన్‌కు సతీ వియోగం


చుండ్రు సరిత

మండపేట: స్థానిక మున్సిపల్ మాజీ చైర్మన్ చుండ్రు శ్రీవర ప్రకాష్ సతీమణి సరిత(44) మృతి చెందారు. ఆమె క్యాన్సర్‌తో బాధపడుతూ హైదరాబాద్, బెంగళూరులోని ప్రముఖ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. శుక్రవారం రాత్రి ఒక్కసారిగా ఆరోగ్యం విషమించడంతో రాజమహేంద్రవరంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా తుది శ్వాస విడిచారు. శనివారం ఆమె పార్థివ దేహానికి ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, పలువురు పట్టణ ప్రముఖులు నివాళులర్పించారు. ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, మున్సిపల్ చైర్ పర్సన్ పతివాడ దుర్గారాణి, జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు కామన ప్రభాకరరావు తదితరులు సూర్యప్రకాష్‌కు తమ ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు.

27న వాహనాల వేలం

రామచంద్రపురం: రామచంద్రపురం ఎస్‌ఈబీ స్టేషన్ పరిధిలో అక్రమ మద్యం రవాణా కేసుల్లో పట్టుబడిన వాహనాలను ఈనెల 27న ఉదయం 10 గంటలకు వేలం వేస్తున్నట్లు సీఐ సీహెచ్ వి.రామకృష్ణ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. స్థానిక స్టేషన్ ఆవరణంలో అమలాపురం అసిస్టెంట్ సూపరింటెండెంట్ సమక్షంలో మొత్తం 6 వాహనాలకు వేలం నిర్వహిస్తారన్నారు. వేలంలో పాల్గొనే వారు ఆధార్ కార్డు జెరాక్స్, రూ.2 వేల డిపాజిట్ చెల్లించాలన్నారు. వాహనం పాడుకున్న వారు సొమ్మును మొత్తం అదే రోజున 18శాతం జీఎస్టీతో కలిపి చెల్లించాలని, మరిన్ని వివరాలకు ఎస్‌ఈబీ స్టేషన్‌లో సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు.

డీఐపీసీ ప్రత్యేక ఆహ్వానితుడిగా శ్యాం


చైర్ పర్సన్ పుణ్యశీల చేతుల మీదుగా ఉత్తర్వులు అందుకుంటున్న శ్యాం

రామచంద్రపురం: ఏపీ పరిశ్రమల శాఖ అభివృద్ధి సంస్థ డైరెక్టర్ వాసంశెట్టి శ్రీనివాసకుమార్(శ్యాం)ను డిస్ట్రిక్ ఇండస్ట్రీస్ ఎక్స్‌పోర్టు ప్రమోషన్ కమిటీ (డీఐపీసీ)లో ప్రత్యేక ఆహ్వానితుడిగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈమేరకు ఏపీఐడీసీ చైర్‌పర్సన్ బండి పుణ్యశీల చేతుల మీదుగా విజయవాడలో ఉత్తర్వులు అందుకున్నట్లు ఆయన శనివారం స్థానిక విలేకరులకు తెలిపారు. ఏఎంసీ చైర్మన్ పంధు గోవిందరాజు, జెడ్పీటీసీ మేరీండి వెంకటేశ్వరరావు, ఎంపీపీ అంబటి భవానీ, తదితరులు శ్యాంకు అభినందనలు తెలిపారు.

పంట తెగుళ్లపై రైతులు శ్రద్ధ వహించాలి

కాజులూరు: పంట తెగుళ్లపై రైతులు తొలిదశ నుంచి తగిన శ్రద్ధ వహించాలని మండల వ్యవసాయాధికారి వి.అశోక్ అన్నారు. శనివారం మండలంలోని కుయ్యేరు, కాజులూరు తదితర గ్రామాల్లో ఏఓ పర్యటించి రైతులకు పలు సూచనలు చేశారు. వరిసాగులో నారుమడి దశ నుంచే మేలైన యాజమాన్య పద్ధతులు పాటిస్తే నాణ్యమైన అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. ప్రస్తుతం మండల గ్రామాల్లో నారుమడుల దశ కొనసాగుతుందని నారుచల్లే ముందు ఐదు సెంట్ల నారుమడికి దమ్ములో ఆరు కిలోల సింగిల్ సూపర్‌ఫాస్ఫేటు, రెండు కిలోల యూరియా, ఒక కిలో పొటాష్ ఎరువులను తప్పనిసరిగా వేయాలన్నారు. విత్తనాలు చల్లిన 15 రోజులకు రెండు కిలోల యూరియా వేయాలని నారు తీయడానికి నాలుగు రోజులు ముందు కార్బోఫ్యూరాన్ 3జీ గుళికలు ఒకకిలో వేసినట్లయితే నాటిన 15 రోజుల వరకు సస్యరక్షణ ఖర్చును ఆదా చేయవచ్చన్నారు.

నిలకడగా గోదావరి


కోటిపల్లి రేవులో నిలకడగా ఉన్న వరద


కేదారిలంకలో ఇటుక బట్టీల వద్దకు చేరిన వరదనీరు

- నిలిచిపోయిన పంటు ప్రయాణం
- రాకపోకలకు ప్రయాణికుల అవస్థలు

కె.గంగవరం: తాజాగా ఇటీవల ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాలకు ధవళేశ్వరం కాటన్ బ్యారేజీకి భారీగా వరద చేరుతుంది. వరదనీరుని కాటన్ బ్యారేజీ నుంచి సముద్రంలోకి వదలడం వల్ల కోటిపల్లిలో వరద గత రెండు రోజులుగా పెరుగుతుంది. శనివారం ఉదయం నుంచి గోదావరి నిలకడగా ఉందని స్థానికులు అంటున్నారు. గోదావరి అవతల వైపునకు వెళ్లే ప్రజలు ఎక్కువగా కోటిపల్లి–ముక్తేశ్వరం మధ్యలో తిరిగే పంట్లనే ఆశ్రయిస్తుంటారు. అయితే వరద ఉధృతి వల్ల గోదావరి పెరిగిపోవడంతో పంటు ప్రయాణాన్ని గత మూడు రోజులుగా రెవెన్యూ అధికారులు నిలిపివేశారు. నిత్యం సొంత పనులపై వెళ్లే వ్యాపారులు, కూలీలు పంటు నిలిచిపోవడం వల్ల ఇబ్బందులు పడుతున్నారు. యానం నుంచి వెళ్లాలంటే చాలా దూరమని దీంతో ఆర్థికంగా కూడా నలిగిపోతున్నామని వారు చెబుతున్నారు.

సందర్శకుల తాకిడి..

సముద్రంలో కలిసేందుకు ఉవ్వెత్తున ఉధృతితో ఎగసిపడుతూ పరవళ్లు తొక్కుతున్న గోదావరిని చేసేందుకు కోటిపల్లి రేవుకు ప్రజలు భారీగా తరలివస్తున్నారు. పలు ప్రాంతాల నుంచి యవకులు, మహిళలు రేవులో ఫెర్రీ వద్ద గోదావరి చూసేందుకు తహతహలాడుతున్నారు. దీంతో కోటిపల్లి రేవు మొత్తం సందర్శకుల తాకిడిలో సందడిగా మారింది.

ఆందోళనకరంగా గోదావరి

కపిలేశ్వరపురం: ఎగువ నుంచి వరదనీరు రావడంతో గోదావరి నీటిమట్టం పెరుగుతున్న నేపథ్యంలో కపిలేశ్వరపురం మండలంలోని లంక గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ధవళేశ్వరం బ్యారేజీ వద్ద ఒకటో ప్రమాద హెచ్చరిక జారీ చేసిన నేపథ్యంలో మండలంలోని కేదారిలంక, వీధివారిలంక, నారాయణలంక, పల్లపులంక, అద్దంకివారిలంక గ్రామాల ప్రజలు భయపడుతున్నారు. గోదావరి ఉధృతంగా ప్రవహిస్తోంది. కేదారిలంకలోని ఇటుక బట్టీలు ముంపుబారిన పడ్డాయి. అద్దంకివారిలంక, పల్లపులంక గ్రామాల్లోని వ్యవసాయ క్షేత్రాలను వరదనీరు తాకింది. వరద ఉధృతి మరింత పెరిగితే గ్రామాలను ముంచెత్తుతుంది. ప్రస్తుత సమాచారం మేరకు లంక గ్రామాలకు ఎలాంటి ముప్పు లేదని, వరదలను ఎదుర్కొనేందుకు అధికారులంతా సన్నద్ధమై ఉన్నారని తహసీల్దార్ కొమరం సూర్యారావు అన్నారు. ఆయా గ్రామాల్లో కార్యదర్శి సీహెచ్ నరసింహారావు, సచివాలయ ఉద్యోగులు, సర్పంచ్ వీధి వెంకటరెడ్డి, ఎంపీటీసీ యర్రంశెట్టి నాగేశ్వరరావు, వైఎస్సార్ సీపీ నాయకులు కొండేటి వెంకటేశ్వరరావు, పోలిశెట్టి గణేష్ తదితరులు పర్యటించారు.

రాజకీయాలకు అతీతంగా పేదలకు పథకాలు


వల్లూరు సురక్ష గ్రామ సభలో మాట్లాడుతున్న త్రిమూర్తులు


పసలపూడిలో ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న పార్టీ యువనేత పృథ్వీరాజ్

ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు

కపిలేశ్వరపురం: రాజకీయాలకు అతీతంగా పేద, మధ్య తరగతి ప్రజలందరికీ ప్రభుత్వ లబ్ధిని అందజేస్తున్న ఘనత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికే దక్కుతుందని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అన్నారు. వల్లూరులో శనివారం సర్పంచ్ దాసి మీనాకుమారి అధ్యక్షతన నిర్వహించిన జగనన్న సురక్ష గ్రామసభలో ఎంపీపీ మేడిశెట్టి సత్యవేణి, జెడ్పీటీసీ పుట్టపూడి అబ్బు, ఎంపీడీఓ ఎం.రామకృష్ణ, తహసీల్దార్ కొమరం సూర్యారావులతో కలిసి లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలను అందజేసి అనంతరం ఎమ్మెల్సీ తోట మాట్లాడారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ ముత్యాల సతీష్, వైఎస్సార్‌సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు చేంబ్రోలు వీరభద్రరావు, సచివాలయ కన్వీనర్ కోట నాగు, మండల సాగు సలహా మండలి చైర్మన్ పుట్టా కృష్ణమూర్తి, గ్రామ కార్యదర్శి తాతపూడి సుభాకర్ పార్టీ నాయకులు దేవళ్ళ రుద్రయ్య, గృహ సారథులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

ఏడిద సీతానగరంలో...

మండపేట: ఏడిద సీతానగరంలో సర్పంచ్ వరదాలక్ష్మి అధ్యక్షతన జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ యువనేత తోట పృథ్వీరాజ్ పాల్గొని లబ్ధిదారులకు ప్రభుత్వ ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యులు కుడుపూడి భవాని, పార్టీ రాష్ట్ర కార్యదర్శి దూలం వెంకన్నబాబు, తహసీల్దార్ రాజేశ్వరరావు, ఎంపీడీఓ రాజు, ఉప సర్పంచ్ వరదా చక్రవర్తి, ఎంపీటీసీ సభ్యులు రామరాజు, న్యాయవాది గోవిందరాజు, పార్టీ నాయకులు ప్రసన్నకుమార్, కిశోర్, గణపతి, సచివాలయ కన్వీనర్లు పాల్గొన్నారు.

పేదలకు మేలు చేసే ప్రభుత్వం ఇదే

రాయవరం: దేశంలో పేదలకు మేలు చేసే ప్రభుత్వం వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మాత్రమేనని వైఎస్సార్ సీపీ యువనేత తోట పృథ్వీరాజ్ అన్నారు. మండలంలోని పసలపూడి, మాచవరం గ్రామాల్లో శనివారం సర్పంచ్‌లు కడలి పద్మావతి, కత్తుల సీతామహాలక్ష్మి ఆధ్వర్యంలో జరిగిన జగనన్న సురక్ష శిబిరాల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పృథ్వీరాజ్ మాట్లాడుతూ 40 ఏళ్ల ఇండస్ట్రీ అని గొప్పలు చెప్పుకునే చంద్రబాబు ముఖ్యమంత్రిగా రాష్ట్ర ప్రజలకు చేసిందేమిటని ప్రశ్నించారు. మండపేట ఏఎంసీ చైర్మన్ సిరిపురపు శ్రీనివాసరావు, జెడ్పీటీసీ నల్లమిల్లి మంగతాయారు, ఎంపీపీ నౌడు వెంకటరమణలు మాట్లాడుతూ ఎన్నికలు సమీపిస్తుండడంతో ప్రతిపక్షాలు మరోసారి ప్రజలకు మభ్యపెట్టాలని ఆచరణకు నోచుకోని హామీలను గుప్పిస్తున్నారని అన్నారు. మాయగాళ్ల మాటలను ప్రజలు నమ్మరన్నారు. అనంతరం ముఖ్యఅతిథులు చేతులమీదగా రెండు గ్రామాల ప్రజలకు అవసరమైన ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పసలపూడి గ్రామశాఖ అధ్యక్షుడు చింతా సుబ్బారెడ్డి, మల్లిడి రామారెడ్డి, ఉపసర్పంచ్‌లు పడాల వసంతకుమార్‌రెడ్డి, పోతంశెట్టి సాయిమోహన్‌రెడ్డి, వైస్ ఎంపీపీ కొవ్వూరి అమ్మిరెడ్డి, ఎంపీటీసీ సభ్యులు కర్రి విజేత, కోట శ్రీలక్ష్మి, పలికెల శోభన, వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి సత్తి వెంకటరెడ్డి, సచివాలయ మండల కన్వీనర్ తమలంపూడి సత్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మణిపూర్ దోషులను కఠినంగా శిక్షించాలి


మండపేట పట్టణంలో నిరసన తెలుపుతున్న ప్రజాసంఘాల కార్యకర్తలు


ఖండ్రికలో కొవ్వొత్తులతో నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు

మండపేట: మణిపూర్ ఘటనలో దోషులను కఠినంగా శిక్షించాలని పట్టణంలో శనివారం పలు ప్రజా సంఘాలు ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. కలువపువ్వు సెంటర్ నుంచి ప్రధాన రహదారి మీదుగా బస్‌స్టాండ్ వరకూ ర్యాలీ సాగింది. ఘటనను నిరసిస్తూ నినాదాలు చేశారు. కొవ్వొత్తులతో నిరసన తెలిపారు. మహిళలపై ఉన్మాదుల చర్యను యావత్‌భారతావని నిరసిస్తుందని నాయకులు సీఐటీయూ, మున్సిపల్ వర్కర్స్, ఉద్యోగుల సంఘం, జమాతే ఇస్లాం, ఎమ్మార్పీఎస్ నాయకులు రాణి, కుమారి, కె.నరేంద్రకుమార్, బి.కొండ, మహమ్మద్ షరీఫ్, అబ్దుల్లా అల్లా, అబిదా సుల్తాన్, ధూళి జయరాజ్, అంగన్వాడీలు అన్నారు.

మణిపూర్ ఘటనపై నిరసన

కపిలేశ్వరపురం: మణిపూర్ ఘటనపై మండలంలోని కపిలేశ్వరపురం, అంగర, పడమర ఖండ్రిక, వడ్లమూరు, నల్లూరు తదితర గ్రామాల్లో అంగన్‌వాడీలు శనివారం ఆందోళన కార్యక్రమాలను చేపట్టారు. మహిళల రక్షణకై నినాదాలు చేస్తూ కొవ్వొత్తులతో నిరసన తెలిపారు. ఈ ఘటన భారత ఔన్నత్యానికి మాయని మచ్చ అని ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు ఎం.జానకి, ఎం.బేబి ఉన్నారు.

బస్‌షెల్టర్ నిర్మించాలి

కాజులూరు: కాకినాడ–కోటిపల్లి రహదారిలో గొల్లపాలెంలోని కాజులూరు జంక్షన్ వద్ద బస్‌షెల్టర్ నిర్మించాలని ప్రయాణికులు కోరుతున్నారు. కరప, కాజులూరు మండలాల్లో 20 గ్రామాలకు కూడలి అయిన ఈ సెంటర్‌లో నిత్యం వందల సంఖ్యలో ప్రయాణికులు బస్సులు ఎక్కుతుంటారు. ప్రయాణికులు బస్సుల కోసం నిరీక్షించే సమయాల్లో వీరికి సరైన షెల్టర్ సదుపాయం లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కుంటున్నారు. షాపుల అరుగుల పైన దుకాణాల ఎదుట నిలిచి ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ ప్రయాణికులు బస్సుల కోసం నిరీక్షించాల్సి వస్తుంది. కొన్ని సమయాల్లో తమ వ్యాపారాలకు అడ్డు వస్తున్నామంటూ దుకాణం దారులు ఆగ్రహానికి గురౌతున్నారని ప్రయాణికులు వాపోతున్నారు. అధికారులు స్పందించి ఈ జంక్షన్‌లో బస్‌షెల్టర్ ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

మహిళలకు ఉపాధి కల్పనే ధ్యేయం

అమలాపురం రూరల్: పేద, మధ్యతరగతి నిరుద్యోగ మహిళలకు ఉపాధి కల్పించాలన్నదే స్వర్ణ సోషల్ సర్వీస్ ఆర్గనైజేషన్ ధ్యేయమని ఆ సంస్థ అధ్యక్షురాలు స్వర్ణలత అన్నారు. శనివారం స్వర్ణ సోషల్ సర్వీస్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో వన్నెచింతలపూడి గ్రామంలో 100 కుట్టుమెషీన్లను మహిళలకు అందజేశారు. ఈ సందర్భంగా స్వర్ణలత మాట్లాడుతూ నిరుద్యోగ మహిళలకు ఉపాధి కల్పించేందుకు సగం ధరకే కుట్టు మెషీన్లను అందిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ నక్కా రాజారత్నం, సీఆర్పీఎఫ్ ఇండియా అధినేత గుడివాడ పాల్‌ప్రసాద్, సంస్థ జిల్లా కోఆర్డినేటర్ గుత్తాల జ్యోతిబాబు, ఏడిద వేణు బాబు, ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులకు... హోమియోతో చెక్



వర్షా కాలంలో చుట్టుముట్టే సీజనల్ వ్యాధులు

రామచంద్రపురం రూరల్: వర్షాకాలం.. వ్యాధులు ముసిరే కాలం. సాధారణంగా ప్రజలు ఈ కాలంలో దగ్గు, జలుబు, జ్వరం, డెంగీ, మలేరియా, టైఫాయిడ్, స్వైన్ ఫ్లూ తదితర వ్యాధుల బారినపడి ఏటా ఇబ్బందుల పాలవుతున్నారు. ఈ సీజనల్ వ్యాధులతో ఆసుపత్రులకు క్యూలు కడుతూ ఆర్థికంగాను, ఆరోగ్యపరంగాను సతమతమవుతున్నారు. వైరల్ జ్వరాల బారిన పడినవారి బాధ అయితే వర్ణనాతీతంగా ఉంటోంది. వైరల్ జ్వరాల బారిన పడిన వారిని కొన్ని ప్రైవేట్ ఆసుపత్రులు డెంగీ అంటూ, ప్లేట్‌లెట్‌లు పడిపోయాయంటూ భయపెట్టి రూ.వేలు దోచుకుంటున్నారు. వ్యాధి బారిన పడి బాధలు పడే కంటే ముందు జాగ్రత్తతో వ్యాధుల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని దీనికి హోమియోపతి సరైన పరిష్కారం అంటున్నారు ద్రాక్షారామ ప్రభుత్వ హోమియో వైద్యశాల మెడికల్ ఆఫీసర్ డాక్టర్ వి.ఫణి వెంకటలక్ష్మి. వర్షాకాలం వచ్చినప్పటి నుంచి కొన్ని జాగ్రత్తలు తీసుకుంటూ ముందు జాగ్రత్తగా హోమియో మందులు వేసుకుంటే సీజనల్ వ్యాధుల బారిన పడకుండా సమర్థవంతంగా పనిచేస్తాయంటున్నారు. రామచంద్రపురం నియోజకవర్గం రామచంద్రపురం మండలం ద్రాక్షారామలోను, కె.గంగవరం మండలంలోని కోటిపల్లి గ్రామాల్లో ప్రభుత్వ హోమియో వైద్యశాలలు ఉన్నాయి. రామచంద్రపురం పట్టణంలో మున్సిపల్ హోమియో వైద్యశాల ఉంది. మండపేట నియోజకవర్గం మండపేట మండలంలో తాపేశ్వరం, రాయవరం మండలం వెంటూరు గ్రామాల్లో ప్రభుత్వ హోమియో వైద్యశాలలు ఉన్నాయి.

సీజనల్ వ్యాధుల నుంచి రక్షణ



సీజనల్ వ్యాధులు రాకుండా నివారించడానికి హోమియోపతిలో మంచి మందులు అందుబాటులో ఉన్నాయి. కుటుంబంలో చిన్నారులు, పెద్దలు అందరూ ఈ మందులు వేసుకుంటే వ్యాధుల బారిన పడకుండా రక్షణ పొందవచ్చు. ఒకవేళ కుటుంబంలో ఎవరైనా వైరల్ ఫీవర్ బారిన పడితే మిగిలినవారు దాని బారిన పడకుండా హోమియో నివారణ మందులు తక్షణం వేసుకున్నా ఉపయోగం ఉంటుంది. హోమియో ఆసుపత్రుల్లోను, క్యాంపుల్లోను ప్రజలు నివారణ మందులు తీసుకుని సీజనల్ వ్యాధుల బారిన పడకుండా కాపాడుకోవాలి. దీనికి తోడుగా ఇంటిలోను, ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవడం, మంచినీరు కాచి వడపోసి తాగడం వంటి జాగ్రత్తలు తీసుకోవాలి.

– వి.ఫణి వెంకటలక్ష్మి, మెడికల్ ఆఫీసర్, వెంటూరు ప్రభుత్వ హోమియో వైద్యశాల

మొహర్రం సంతాప దినాల్లో పీర్ల ఊరేగింపు


ద్రాక్షారామలో పీర్లను ఊరేగిస్తున్న ముస్లింలు

రామచంద్రపురం రూరల్: మొహర్రం సంతాప దినాల్లో భాగంగా మూడో రోజైన శనివారం అలీ అస్గర్ జూల (గుమ్మటాన్ని) ఇమాం అలీ రజా పంజా నుంచి ఆగా వరకు అలంకరించిన పీర్లను ఊరేగింపుగా మాతం నిర్వహించుకుంటూ తీసుకుని వచ్చి ఫాతీహా ఇచ్చి తిరిగి పెద్ద మసీదు వరకు ఊరేగించారు. దూర ప్రాంతాల నుంచి వచ్చిన అనేక మందికి భోజన సదుపాయం కల్పించారు. మత గురువు మౌలానా మహమ్మద్ షంషి మజ్లిస్ ఆలపించి మొహర్రం విషాదం గురించి భక్తులకు వివరించారు. ముస్లిం భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

నియోజకవర్గంలో స్వేచ్ఛాయుత జీవనం

రామచంద్రపురం: స్థానిక ఎమ్మెల్యే చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ మంత్రి పదవిని చేపట్టిన మూడేళ్లలో నియోజకవర్గంలో ప్రజలకు స్వచ్ఛమైన పాలన అందించటంతో స్వేచ్ఛాయుత జీవనం సాగిస్తున్నారని వైఎస్సార్ సీపీ నేతలు పేర్కొన్నారు. రాష్ట్ర బీసీ సంక్షేమం శాఖ మంత్రి పదవిని చేపట్టి మూడేళ్లు అయిన సందర్భంగా నేడు (ఆదివారం) నియోజకవర్గంలోని ప్రజాప్రతినిధులు, పార్టీ నేతలు ఆత్మీయ కలయికను ఏర్పాటు చేసినట్లు రామచంద్రపురం శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు తెలియజేశారు. గతంలో ఎన్నడూ లేని విధంగా బీసీ, ఎస్సీలకు పెద్దపీట వేస్తూ ఏఎంసీ, జెడ్పీటీసీ, ఎంపీపీ, ఎంపీటీసీ, పీఏసీఎస్, సర్పంచ్‌ల పదవులను 50 శాతానికి పైగా వచ్చే విధంగా చేశారన్నారు. రామచంద్రపురం మున్సిపాలిటీలో మున్సిపల్ వైస్ చైర్మన్, జెడ్పీటీసీ కో ఆప్షన్ సభ్యుల పదవులను ఎస్సీ మాదిగ సామాజికవర్గాల వారికి కేటాయించి గత చరిత్రలో లేని విధంగా చేసిన ఘనత మంత్రి వేణుకు దక్కిందన్నారు. కొంత మంది అరాచక శక్తులు శాంతియుత వాతావరణాన్ని చెడగొట్టాలని ప్రయత్నం చేసినా మంత్రి వేణు తనదైన శైలిలో ప్రజా జీవనానికి ఎటువంటి విఘాతం కలగకుండా చేశారన్నారు. కోవిడ్ సమయంలో ఎక్కడా లేని విధంగా ఆపదలో ఉన్నవారిని అర్ధరాత్రి సైతం ఆదుకుంటూ ఎంతో మందికి ప్రాణభిక్ష పెట్టారని గుర్తు చేశారు. ఏరియా ఆసుపత్రిలో కోవిడ్ ప్రత్యేక వార్డులను ఏర్పాటు చేసి చికిత్సలు అందించటంతో పాటుగా తన సొంత ఖర్చులతో భోజన వసతులను కూడా కల్పించారని వారు తెలిపారు. అటువంటి సమయంలో మంత్రిగా మూడేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా మంత్రి వేణుగోపాలకృష్ణను మనమందరం సత్కరించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. నేడు జరగబోయే ఆత్మీయ కలయికకు ప్రజా ప్రతినిధులు, పార్టీ నేతలు కదలిరావాలని వారు పిలుపు నిచ్చారు. ఏపీఐడీసీ డైరెక్టర్ వాసంశెట్టి శ్యాం, ఏఎంసీ చైర్మన్ పండు గోవిందరాజు, పార్టీ నేతలు పంపన సుబ్బారావు, పెట్టా శ్రీనివాసరావు, టేకుమూడి సత్యనారాయణ, మండపల్లి చిట్టిబాబు, కుడిపూడి గణేష్ తదితరులు పాల్గొన్నారు.

కాశీ కుటుంబ సభ్యులకు మంత్రి పరామర్శ


కాశీ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మంత్రి వేణు

కె.గంగవరం: మండలంలోని సత్యవాడ మాజీ సర్పంచ్, మాజీ సాగునీటి సంఘం అధ్యక్షుడు తోట కాశీ ఇటీవల అనారోగ్యంతో ఆకస్మికంగా మృతి చెందారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాల కృష్ణ, కాశీ కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. మాజీ మండల కన్వీనర్ ఓబులనేని రాజ్‌కుమార్, సచివాలయాల మండల కన్వీనర్ తోకల శ్రీను, పార్టీ నాయకులు సలాది శ్రీను, పంపన సుబ్బారావు, చీకట్ల గోపాలం తదితరులు పరామర్శించిన వారిలో ఉన్నారు.

వలంటీర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

కె.గంగవరం: మండలంలోని పలు గ్రామాల్లో ఖాళీగా ఉన్న వలంటీర్ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంపీడీఓ ఎస్.శ్రీనివాసరావు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. మండలంలోని భట్లపాలిక సచివాలయం పరిధిలో–1, దంగేరు–1, కె.గంగవరం–2, కోట–1, కుదుపూరు–1, తామరపల్లి–1, యర్రపోతవరం–1 పోస్టులకు ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 25 నుంచి 27వ తేదీలోపు ఆయా గ్రామాల్లోని సచివాలయం ఆన్‌లైన్‌లో గాని దరఖాస్తు చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. దరఖాస్తుల అనంతరం జూలై 31న ప్రభుత్వం నియమించిన కమిటీ ద్వారా ఇంటర్వ్యూలు నిర్వహించి పోస్టింగ్ ఇస్తామని చెప్పారు.